కథ



# "ప్రేమంటే..."

యస్. జతిన్‌కుమార్

## "ఐ లవ్ యూ... యూ లవ్ మీ?"

## తెలీదు.

## ఏం తెలీదు? నేనంటేనా? లవ్వంటేనా?

## రెండూ-

## నేనంటే నీకిష్టంలేదా?

## ఇష్టమే- కానీ అదేనా? అంతేనా?

"అదే...అది 'అదే...' నాకు తెలుసుకదా. అదే ప్రేమంటే. నేను ఎంతగానో ప్రేమిస్తున్నాను. నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను" ఎందుకు?

"ఎందుకేమిటి? ప్రేమిస్తున్నానంటే ఎగిరి గంతేయక ఎందుకు అంటావు! ఈ ప్రశ్న ఎవరూ, ఎపుడూ అడిగివుండరు" ముఖం ముడుచుకుంది. ఉత్సాహం.

"ప్రేమంటే ఏమిటో? ఎందుకో నాకు తెలీదు. చెప్పొచ్చుగా..."

"ప్రేమంటే ప్రపంచమంతా మోకరిల్లిపోతుందే! విశ్వమంతా ప్రేమ మంత్రం వినిపిస్తోందే... ప్రేమంటే తెలీదా? తమాషానా? ఎన్ని కథలు...నవలలు...సినిమాలు...కళలు...ఎన్ని? ఎన్నెన్ని? ప్రేమ గురించి ఎంత చెప్పాయి! ప్రేమంటే తెలీదా?"

"అవన్నీ కాదు. ప్రేమంటే నీకేమిటో, నాకు తెలియాలి.

నా మీద ప్రేమ అంటే నీవేమనుకుంటున్నావో తెలియాలి".

"ఓహో! అదా!" తేలికగా నవ్వేసింది.

"ప్రేమంటే ప్రేమే" చిలిపినవ్వు పూసింది.

"తమాషా కాదు. సరిగ్గా చెప్పు".

"అరె; బాబా! ఎప్పుడూ నీతో వుండాలనిపిస్తుంది. నీతోనే ఆడాలనిపిస్తుంది. నీతోనే గడపాలనిపిస్తుంది. నువ్వు లేకపోతే ఆకలుండదు...దాహముండదు...నాకు ఏదీ సహించదు. దిగులు, బెంగ... ప్రతిక్షణం నువ్వే గుర్తొస్తావు. నువ్వు నాదగ్గరుంటే నాకు సంతోషం. దీన్నే ప్రేమంటారు" సీరియస్‌గా అన్నది.

"అవునా! నువ్వు నన్ను ప్రేమిస్తే... నాతో వుంటే 'నీకు' సంతోషం నేను లేకపోతే 'నీకు' సంతాపం... నా మీద ప్రేమ 'నీ' ఆనందం కోసమేగా!

"అవును...నీ మీది ప్రేమే నాకు ఆనందం. అందుకే నువ్వు కావాలి".

'ఆగాగు. 'నీ' ఆనందంకోసం, 'నీ' సంతోషం కోసం నేను 'నీకు' కావాలి. అయితే ప్రేమంటే 'నీ' స్వార్థమేగా? నీ స్వంత భావమేగా? ఇందులో నాకు దొరికేదేమిటి?

"ప్రేమంటే స్వార్థం కాదు...త్యాగం మహానుభావా!"

"కబుర్లు చెప్పకు" నీ ఆనందంకోసం నీకు నీవుగా పెంచుకున్నది ప్రేమ. దానికి ఆలంబనం నేను. అంతేకానీ ఇందులో 'మన' ఏముంది? 'నా' పాత్ర ఏముంది? నీ గురించి కాక- నా గురించి నువ్వు ఆలోచిస్తే అది ప్రేమ అవుతుందేమో? నీ సమక్షంలో నేను పొందే శాంతిని, హాయిని 'ఇవ్వటానికి' నువ్వు సిద్ధపడితే అది ప్రేమ అవుతుందేమో! ఎదుటివ్యక్తికోసం మనం కరిగిపోతే అది ప్రేమ అవుతుందేమో! కానీ ఎదుటివ్యక్తి వల్ల మనకు దొరికేదాన్ని గురించే ఆలోచిస్తే, అదే అనుభవిస్తే 'పొందటం' గురించే చూస్తే అది ప్రేమ కాదేమో! ఏమో!" దిగంతాలలోకి చూపులు విచ్చుకుంటున్నాయి.

"మహానుభావా! ఇది వితండవాదం... ఈ చల్లని సాయంత్రాన్ని ఎందుకిలా ఖూనీ చేస్తావు! హాయిగా...మనసు జల్లుగా, ఝల్లుమనేలా నాలుగు మంచి ప్రేమ ముచ్చట్లు చెప్పరాదూ ఈ లాజిక్ ఎందుకూ?" బుంగమూతి ముడుచుకుంది.

***

"ఏం ఆలోచించావు?"

'ప్రేమకు ఆలోచనకు లంగరు కుదరటంలేదు'

"ఎందుకనో?"

ప్రేమంటే ఆవేశం. అనుభూతి. అది గుండెది. ఆలోచన అంటే అది నిలకడ. ఆచరణ. అది మెదడుది. "దిల్ ఔర్ దిమాగ్..." ఈ రెంటికీ కుదరటం లేదు.

"అయితే ప్రేమకు ఆలోచన రాదంటావా? ఆలోచనాపరులకు ప్రేమ లేదంటావా?"

"ప్రేమకు లాజిక్ లేదంటావుగా"

"మహాప్రభూ- మళ్ళీ దారి తప్పుతున్నావు. మన ప్రేమకు మూడేళ్ళ వయసు. దానికి పెళ్ళి చేయాలి".

"అంటే ప్రేమకు ముగింపు పెళ్ళా? ఇదేనా లాజిక్"

"అవన్నీ కాదు. ఇక నువ్వు, నేను ఒకటి కావాలి. పెళ్ళి చేసుకోవాలి."

'ప్రేమంటే నువ్వు; నేను. అంతే... మరి పెళ్ళి అనేసరికి మీ వాళ్ళు... మా వాళ్ళు...నీ కులం...నా కులం, ధనికులం...పేదలం, నీ మతం, నా మతం...ఇవన్నీ వొస్తున్నాయే? మన పెళ్ళికి ఎవరు వొప్పుకుంటారు?

"మా వాళ్ళు వొప్పుకుంటారు. చిన్నతనం నుంచీ నన్ను అల్లారు ముద్దుగా పెంచారు. నా కోర్కెలన్నీ తీర్చారు. నాకు పెన్సిలు కావాలంటే నాకు నచ్చే రంగుకోసం పది షాపులు తిరిగేవాడు మా నాన్న.

నాకు డ్రస్ కొనాలంటే ఓ పూట శెలవుపెట్టి మరీ, పది బజార్లు తిప్పి నాకు ఇష్టమైనదే కొనేది మా అమ్మ...అలాంటిది "నువ్వు నాకిష్టం" అని చెబితే వెంటనే పెళ్ళి చేయరూ? మీ వాళ్ళ సంగతి నువ్వు ఆలోచించుకో".

"ఎంత ఆశ అమ్మాయిగారికి! అంత అపురూపంగా పెంచిన నిన్ను నా చేతిలో పెట్టటానికి వాళ్ళు వొప్పుకోరు. వాళ్ళకూ ఎన్నో ఆశలు... కలలు ఉంటాయి. అవన్నీ నీ ద్వారా తీర్చుకోవాలనుకుంటారు. అవన్నీ వొదిలేసి నిన్ను అంత తేలికగా పంపిస్తారా? నేనేమన్నా ప్రిన్స్ ఆఫ్ వేల్స్‌నా?"

"వాళ్ళు వొప్పుకోకపోయినా నేను వచ్చేస్తాను. నాకు నువ్వు కావాలి! నీతో జీవితం కావాలి. నీతో నేను పొందే సుఖం కావాలి! జీవితాంతం నీ తోడు కావాలి...

"ఇదే...ఇదే నేను అనేది. ఇది నీ స్వార్థం బుస కాదూ? నీ సుఖ లాలస కాదూ?"

"కాదు...నీ కోసం...నీతో బతకటంకోసం మా వాళ్ళను 'త్యాగం' చేస్తాను. నీ మమతలు పొందటంకోసం నా మతాన్ని వొదిలేస్తాను. నీతో గడపటం ముందు ఇవన్నీ గడ్డిపోచలు."

"సరే నేనూ సిద్ధమే! మన మధ్య 'ధనం' 'మతం' అడ్డురాకపోతే, నా కోసం త్యాగం చేయడానికి సిద్ధపడే నిన్ను అంగీకరిస్తాను. నా వాళ్ళకు నేనూ దూరమవుతాను నీతోనే నా లోకం...కాదు ఇక నీవే నా లోకం..."

***

"ఎన్నాళ్ళిలా"?

"ఎలా?"

"తిక్కగా మాట్లాడకు. మనం ఇలా వచ్చేసి మూడు నెలలు. నీ ఆటో సంపాదన ఒక్క పూటకు చాలటం లేదు".

"నీకూ జాబ్ చూస్తాను. సేల్స్ గర్ల్‌గా చేరుదుగాని".

"చేరితే?"

"డబ్బు ఇబ్బందులు తగ్గుతాయిగా!"

"గొర్రెకు బెత్తెడేగా తోకా"

"ఓ డాటరాఫ్ విక్టోరియా! వైఫ్ ఆఫ్ ఆటోవాలాగా ఆలోచించు".

"అవసరాల వొత్తిడి, ఆర్థిక ఇబ్బందులు...వీటితోనే సతమతమవుతుంటే ఇక మన ప్రేమ సంగతి ఏమిటి?"

"కష్టం సుఖం కలిసి పంచుకోవడమేగా ప్రేమంటే".

"ఎప్పటికీ కష్టాలు, కడగళ్ళు అయితే జీవితంలో మాధుర్యం ఏదీ? నేను కలగన్న అందమయిన జీవితం ఏది?"

'నీకోసం నేను, నాకోసం నీవు' ఇంతకన్నా అందమయిన జీవితం ఏముంటుంది?

***

"ఇలా బాగోలేదు. మన వూరు వెళదాం."

"వెళితే?"

"మనవాళ్ళు ఆదరించరా?"

"మనవాళ్ళని వొద్దనుకున్నాం. మనిద్దరమే లోకమనుకున్నాం"

> ఎప్పుడూ నీతో వుండాలనిపిస్తుంది. నీతోనే ఆడాలనిపిస్తుంది. నీతోనే గడపాలనిపిస్తుంది. నువ్వు లేకపోతే ఆకలి ఉండదు...దాహముండదు...నాకు ఏదీ సహించదు. దిగులు, బెంగ... ప్రతిక్షణం నువ్వే గుర్తొస్తావు. నువ్వు నాదగ్గరుంటే నాకు సంతోషం. దీన్నే ప్రేమంటారు"

"అప్పుడనుకొన్నాం. కొన్నాళ్ళు దూరమయితే వాళ్ళు వచ్చి తీసుకు వెళతారనుకున్నా. నన్ను ఎంత ప్రేమగా పెంచారు! ఆ ప్రేమంతా ఏమయ్యిందో- సరే మీ వాళ్ళు నువ్వు మాత్రం వాళ్ళకు అవసరం కాదూ! నేను పెద్దింటిదాన్నేగా వాళ్ళయినా మనల్ని దగ్గరికి తీయరా? అందరికీ దూరంగా ఎందుకిలా? ఇన్నాళ్ళయ్యింది. ఇక వాళ్ళేం చేస్తారు. తిరిగివెళ్ళి మన చదువులు పూర్తి చేసుకుందాం. దర్జాగా బతుకుదాం".

"అంటే ప్రేమతో బతకలేకపోతున్నావా? ఈ బతుకు మనం కోరుకున్నదేగా? ఇది కష్టంగా వుందా?"

ఆర్తిగా... అనునయంగా తల నిమిరాడు..

"కష్టమని కాదు...వృథాగా ఎందుకీ యాతన? మనం ఇంకా సుఖంగా బతకొచ్చు గదా అని. అయినా అయినవాళ్ళందరికీ దూరంగా; తెలియనివాళ్ళ అవమానపు చూపుల మధ్య- మన వాళ్ళ గురించిన ఆలోచనలతో భారంగా! ఎందుకిలా? ఒక పండగ, పబ్బం లేకుండా. అన్నా, చెల్లీ; అమ్మా, నాన్న ఎవరినీ చూడకుండా- అందరికీ వెలిగా! ఎందుకిలా?"

"భలేదానివే. ఎందుకు అంటే... ప్రేమకోసం అనుకున్నావుగా మన పెళ్ళికి వాళ్ళు ఆమోదించనప్పుడే వాళ్ళను "పరాయివాళ్ళు" అన్నావు. ఒక్క నువ్వు, నేను మాత్రమే "స్వంతం" అన్నావు. వాళ్ళ ప్రేమలన్నీ మిథ్యలు... మనిద్దరి ప్రేమే 'సత్యం' అన్నావు కదా!"

"అవును. అప్పుడలాగే అనిపించింది. మనుషులు ఎప్పుడూ ఒకలాగే వుంటారా? వాళ్ళు మారరా? అనుకున్నాను"

"మారలేదు కనక నువ్వు మారతావా?"

"తప్పేముంది? అమ్మ, నాన్న; అత్త, మామ" వీళ్ళ కోసమేగా మారుతున్నది. మన ఒకరికోసమే కాక మన కుటుంబాల సాన్నిహిత్యం కోసం, మనవాళ్ళ కోసం మారితే తప్పేమిటి?

"తప్పనను. కానీ... మన పిల్లలే కదా అని వాళ్ళు మారటం లేదే? వాళ్ళకెందుకు పట్టుదల... పంతం?"

"దీనికి అంతం లేదు. అందుకే మనమే వెళ్దాం. క్షమించి ఆదరిస్తారు."

"క్షమించడం అంటే... మనం తప్పు చేశామా?"

"అదే- వాదం వద్దు...వెళ్దాం."


"వాళ్ళమీద నాకు నమ్మకం లేదు. కానీ ...నీ ఇష్టమే కానీ...!"

***

"నువ్వు మీ ఇంటికి... నేను మా ఇంటికి"

"ఎందుకలా! ఇద్దరం కలిసే వెళదాం... 'మన' ఇల్లు వొదిలేసి 'మా' 'మీ' ఏమిటి? ఇది చాల పెద్ద పొరపాటు..."

"నా మాట విను. ఒక్కటిగా వెళ్ళామంటే ముందే కోపాలు తాపాలు... మనమాట అసలే



వినరు. ఇలా ఒక్కొక్కరమే వెళదాం. అమ్మా నాన్నలకు నచ్చచెబుదాం. నెమ్మదిగా వాళ్ళ మనసులు గెలుచుకుందాం."


"అనవసరపు ఆశలు నీవి. పెళ్ళయి పదేళ్ళు కాపురం చేసిన వాళ్ళనే విడదీస్తారు వీళ్ళు. మనం ఎంత?"

"చూద్దాం" వొంటరిగా సాగిపోయింది తను.

***

"రెక్కలున్నాయని ఎగిరిపోయారు! రెక్కలు విరిగిపోయాయా? గూళ్ళు కదిలిపోయాయా? మళ్ళీ ఈ గూటికి చేరుకున్నావు..."

"మక్కువతో అక్కున చేర్చుకుంటారనే ఆశతో"



"నీ ఆశలకేం? మా ఆశలన్నీ అడియాసలు చేశావు. నీ మీది నమ్మకాన్ని వొమ్ము చేశావు. నీ కంట్లో నలుసు పడితే మన ఇంట్లో ఉప్పెన వస్తుందే! నీ కాల్లో ముల్లు గుచ్చుకుంటే మా గుండెల్లో గునపం దిగినట్లు బాధపడతామే! మాదంతా ప్రేమ కాదూ? నువ్వు వెళ్ళిం దగ్గర్నుంచీ మా కంటికి కునుకులేదే! మా కడుపుకింత ముద్ద పోదే! ఇదంతా ప్రేమ కాదూ? అతని దొక్కనిదేనా ప్రేమ!

నువ్వు అగ్గిని ముట్టుకుంటుంటే చూస్తూ వూరుకోవటమేనా ప్రేమంటే? నువ్వు వూబిలోకి దిగుతానంటే ప్రోత్సహించటమేనా ప్రేమంటే? నీ కోసం మేము తీర్చిదిద్దిన సుందర భవిష్యత్తును నువ్వు మూర్ఖంగా కాలదన్నుతుంటే వారించకుండా, విచారించకుండా- నువ్వు అన్నదానికి మేము తందాన అనడమే నా ప్రేమంటే! ఎంత చిన్నతనమే నీదీ!

***

అతను ఒక అగ్ని...అతని ప్రేమ ఒక జ్వాల. ఆ వెలుతురు చూస్తుంటే మిగతా అంతా చీకటే అనిపించింది.

కానీ...కానీ...

రంగుల రెక్కలతో తోటంతా ఎగరాలని నా ఆశ.

పదం పదం ఆనందం పొంగే ఏటిపాటలా సాగాలని నా ధ్యాస.

గుండెనిండా గుబురులెత్తిన ప్రేమతో పరిమళభరితం కావాలి నా శ్వాస. ప్రేమ భువినే దివిగా మారుస్తుందంటారే! దివిజగంగలా ఉరికే నన్ను భూమార్గం పట్టించిందేం ఈ ప్రేమ. ప్రేమ మూర్తితో కలిసి చేసినా అతనితో జీవితం అంత సాదాసీదాగా వుందే! విహాయసంవైపు ఎగిరిపోయే నన్ను భూగోళానికి కట్టిపడవేసిందే ఈ ప్రేమ. అతని వూహలు, చేతలు, చేష్టలు అన్నీ నేలమీదే వుంటాయి. ఈ నేలబారు జీవితం జీవితాంతం భరించగలదా తను? మునపటి ఉత్సాహం, ఉద్రేకం ఏమయిపోయాయి?

విరిసీ విరియని పరువంలో తెలిసీ తెలియని వూహలా ప్రేమంటే? తడబడే తప్పటడుగుల తపనేనా ప్రేమంటే? కోరుకోవడం- కోరుకున్నది దక్కించుకోవడం... దానికోసం ప్రాణాలైనా ఇవ్వాలనుకోవడం... తీరా దక్కాక అది తృప్తినివ్వకపోవడం... ఇదేనా ప్రేమపాట!

ఏం కావాలి నాకు? నిజంగా ఏం కోరుకుంటోంది తను?

ప్రేమకోసం అమూల్యమైన జీవితాన్నే కోల్పోవాలా? ప్రేమే లేనప్పుడు జీవితం అమూల్యమవుతుందా?? అసలు జీవితమే లేనప్పుడు, ఇక ప్రేమ ఎక్కడిది? నే కలగన్న జీవితం వేరు, నాకందిన కఠోర వాస్తవం వేరు. వాస్తవాల వేడికి జీవనమే కాగిపోతున్నపుడు ప్రేమ జీవిస్తుందా? జీవితాన్నిస్తుందా? ఇలాంటి ఆవిరి ప్రేమకోసం అందర్నీ అన్నిటినీ వొదులుకోవటం అంటే అది త్యాగమా?? మూర్ఖమా??"

భద్రమయిన భవిష్యత్తునా? దానికోసం ప్రేమ ఛిద్రమయినా భరించడమా నాతో కలిసి స్పందించే హృదయాన్నా? పరువు మర్యాదల, ఆస్తి అంతస్తుల జీవితాన్నా? వడ్డించిన విస్తరినా? చెట్టూ పుట్టా తిరిగి పుల్లా పుడక ముక్కున గరిచి కట్టుకునే గూటినా?

నాలుగురాళ్ళు గడించటానికే జీవనకాలమంతా, యవ్వన సౌరభమంతా ఇగిరిపోతుంటే ఆనందాల రసాలం అందుకునేదెప్పుడు? అనుభూతుల పంచమస్వరం పంచుకునేదెప్పుడు. ప్రేమకోసం అమూల్యమైన జీవితాన్నే కోల్పోవాలా? ప్రేమే లేనప్పుడు జీవితం అమూల్యమవుతుందా?? అసలు జీవితమే లేనప్పుడు, ఇక ప్రేమ ఎక్కడిది? నే కలగన్న జీవితం వేరు. నాకందిన కఠోర వాస్తవం వేరు. వాస్తవాల వేడికి జీవనమే కాగిపోతున్నపుడు ప్రేమ జీవిస్తుందా? జీవితాన్నిస్తుందా? ఇలాంటి ఆవిరి ప్రేమకోసం అందర్నీ అన్నిటినీ వొదులుకోవటం అంటే అది త్యాగమా?? మూర్ఖమా??"

దిగ్గున లేచి కూర్చుంది. తనలోని...లోని ఆలోచనల్లోని తీవ్రతకు తత్తరపడిపోయింది. దిగులుపడి కూర్చుంది.

***

"అతని వలపుల వెచ్చదనం కావాలి. మీ మమతల చల్లదనం కావాలి. మధ్యాహ్నపు సూర్యుని ప్రతాపమే కాదు సాయం సమయపు సమీరమూ కావాలి. నిత్యచైతన్యశీలమయిన ఉషోదయం అతనితో జీవితం. కానీ అదే చాలదు అర్ధనిమీలిత నేత్రాల్లో పొంగే చంద్రకాంతుల రాత్రులూ కావాలి నాకు. అందుకే వచ్చాను అతనిమీద ప్రేమ ఉరవడినుంచి తలెత్తి లేచి, నీ వొడిలోకి మళ్ళీ వచ్చాను. అతన్ని పిలువమ్మా. పిలవనంపమ్మా. అతన్ని నాకివ్వండమ్మా! మీతో వుండనీయండమ్మా..."

"ఇంకా నీకర్థం కాలేదా పిచ్చితల్లీ! అతనితో ప్రయాణం మండుటెండలో కాళ్ళకు రక్షలు లేకుండా నడవటం. నీవో... పాదాలు కందకుండా మా అరచేతులమీద నడచినదానివి. అతను అగ్ని అయితే నీవు అందులో పడి మాడిపోయే శలభానివి. అతన్ని మా అంతస్తు...మా మతం సమ్మతించవు. నీ కళ్ళకు కమ్మిన ప్రేమ పొరలు తొలగించుకుని చూడు. నీ ముందు ఎంత సుఖవంతమయిన; నీ కలలకు అనుకూలమయిన జీవితం మేము కల్పిస్తామో చూడు. నీకు మండే ఎండలూ వద్దు...కళ్ళు కనిపించని కటిక చీకటీ వద్దు. వెన్నెలరాత్రి లాంటి జీవితం నీకోసం కాచుకుని వుంది. మర్చిపో...ఇతన్ని మర్చిపో..."

"మేమిద్దరం మూడు నెలలు కాపురం చేశామే!" ఆఖరి ఆశ.

"నోరు మూసుకో! అరవైఏళ్ళ జీవితం నీ ముందు వుందే!"

"అమ్మా!"

"రేపో మాపో మీ బావ వస్తున్నాడు. జరిగిన భాగోతం తెలియకముందే అతన్ని చేసుకుని అమెరికా వెళ్ళిపో ఇదంతా పీడకలగా మర్చిపో".

"అంతేనా అమ్మా" ఓడిన ప్రేమ స్వరం బలహీనంగా.

"మరి మాట్లాడకు. ఈ అమ్మ మాట విను."

తరతరాల అధికార స్వరం నిర్ణయాత్మకంగా....

***

"అమాయకురాలైన పెద్దింటి అమ్మాయిని కిడ్నాప్ చేస్తావా? పైగా మతం మార్చి... పెళ్ళి చేసుకోమని బలవంతం చేస్తావా? పెళ్ళి పందిరిలోకి వచ్చి 'నా భార్య...నా భార్య' అని గోల చేస్తావా? అరేయ్...నీ అంతం చూస్తాను."

అతని వొంటిమీద పోలీసు లాఠీ...లంచం తిని; అవాకులతో, సంబంధం లేని మతం మెరుపులు కురుస్తోంది.

"ప్రేమంటే మహాకాళి. ప్రేమికుల బలిదానం కోరుతుందది..." ఎక్కడో చదివిన పాఠం అతని గుండెల్లో మోగుతోంది."